

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
నరసరావుపేట	6.24	5.06
గుంటూరు	6.22	5.04
బాపట్ల	6.22	5.04

రంజాన్ వేళలు

మహిళామణులు

- జిల్లా పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్య మహిళల చేతుల్లోనే..
- రెవెన్యూ డివిజన్ పాలన ఆమెదే
- జిల్లా పాలనలో మహిళా అధికారుల కీలకపాత్ర
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కనకదుర్గమ్మ... పార్వతి... సరస్వతి... భ్రమరాంబ వీరంతా దేవతామూర్తులు. వీరందరిని నిత్యం ఆరాధిస్తూ పూజిస్తారు. ఒకప్పుడు కట్టుబాట్ల పేరుతో మహిళను వంటింటికే పరిమితం చేశారు. ఆధునిక సమాజంలో కట్టుబాట్లను తెంచుకుని క్లర్క్ నుంచి పైలట్ వరకు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. వంట చేసిన చేతితో కలం పట్టారు.. గరిట తిప్పిన చేతితో స్టీరింగ్ తిప్పుతున్నారు. ఆటలోను పాటలోను మేము సైతం అంటున్నారు. రాజకీయాల్లోనూ తమ సత్తా చాటుతున్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు.

– నరసరావుపేట ఈస్ట్

సాధారణ స్థాయి నుంచి జిల్లా అధికారిగా..



సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నీలావతిదేవి నేడు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బీఎడ్ పూర్తిచేశారు. భర్త ప్రోత్సాహంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ విద్యామండలిలో 20 సంవత్సరాలపాటు పనిచేశారు. అనంతరం ఏలూరు, రాజమండ్రిలో జిల్లా ఉపవిద్యాశాఖాధికారిగా పనిచేసి నూతన జిల్లాల ఆవిర్భావంతో పల్నాడు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించి సమర్థంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థి దశలో కీలకమైన ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కత్తి మీద సాముగా గుర్తించి సమర్థంగా నడుపుతున్నారు. జిల్లాలోని ప్రతి ఇంటర్మీడియెట్ కళాశాలలను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

కుటుంబ ప్రోత్సాహంతోనే...

మరో ఏడాదిలో ఉద్యోగ విరమణ చేస్తున్నా. నా జీవిత ప్రయాణంలో తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహం ఎంతో ఉంది. ప్రతి ఆడపిల్ల జీవితంలో ఇటువంటి ప్రోత్సాహం ఉన్నప్పుడు వారు సాధించలేనిది అంటూ ఏమీ ఉండదు. అంతరిక్షానికైనా ఎగురగలరు. సైన్యంలో చేరి సరిహద్దులను కాపాడగలరు.

-నీలావతిదేవి, ఇంటర్ విద్యాశాఖాధికారి

పోలీసుశాఖలో అరుణోదయం



తండ్రి ప్రభుత్వ పాఠశాల ఉద్యోగి. తన కుమార్తెలను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా చూడాలనుకున్నాడు. తండ్రి కోరికను తీర్చేందుకు బీటెక్ చదివిన అరుణ దృష్టి ప్రభుత్వ ఉద్యోగ వేటలో పడింది. తొలుత కానిస్టేబుల్‌గా ఎంపికైనప్పటికీ చేరలేదు. తర్వాత వీఆర్‌ఓగా రెండున్నరేళ్లు పనిచేశారు. అంతటితో ఆగకుండా పోటీ పరీక్షలకు హాజరై ఎస్‌ఐగా ఉద్యోగం సాధించారు. పట్టణ ఎస్‌ఐగా రాణిస్తున్నారు.

చిన్నచూపు చూడొద్దు

మహిళలను చిన్నచూపు చూడకూడదు. ఏదైనా సాధించగలం. విశ్రాంతి కోరుకోకుండా దేనినైనా సాధించే తత్వం ఆడవారికే ఉంటుంది. ప్రతి ఆడపిల్ల పోటీతత్వంతో ఉన్నతంగా ఎదగాలి. పోలీస్‌శాఖకు మహిళలు ప్రాధాన్యత ఇవ్వాలి. మహిళల భద్రతకు మహిళలే రక్షణగా ఉండవచ్చు.

-కె.అరుణ, ఎస్‌ఐ వన్‌టౌన్, నరసరావుపేట

విద్యా రంగానికి కళ



జిల్లా విద్యా రంగాన్ని మహిళా అధికారులే ఏలుతున్నారు. పాఠశాల విద్య జిల్లా విద్యాశాఖాధికారిగా ఎల్.చంద్రకళ, ఇంటర్‌విద్యాశాఖాధికారిగా ఎం.నీలావతిదేవి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో నూతనంగా ఏర్పడిన జిల్లాలో శాశ్వత కార్యాలయం లేక అద్దె భవనంలో కొనసాగుతున్న జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి తాను డీఈఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రకళ వెంటనే పరిష్కారాన్ని చూపారు. నిరుపయోగంగా ఉన్న ఎస్‌బీటీ అండ్ ఎస్‌సీవీ కళాశాల హాస్టల్ గదులను జిల్లా కలెక్టర్ సహకారంతో డీఈఓ కార్యాలయంగా మార్చారు. ఆమె పర్యవేక్షణలో విద్యాశాఖ సిబ్బంది వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని తమ కార్యాలయాన్ని తీర్చిదిద్దుకున్నారు. నిత్యం ఏదో ఒక పాఠశాలను సందర్శిస్తూ బాలికలకు చదువు ప్రాధాన్యతను వివరిస్తున్నారు.

బాలికలను చదివించాలి..

సమాజంలో ప్రతి ఒక్కరూ బాలికల విద్య పట్ల శ్రద్ధ తీసుకోవాలి. పాఠశాల విద్యతోనే ఆపివేయకుండా వారికి ఉన్నత విద్యను అందించాలి. చదువుతోనే ఏదైనా సాధించగలమని మహిళలు గుర్తించాలి. బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించారు. మహిళలు సాధించలేనిది ఈ ప్రపంచంలో ఏదీ లేదు.

-ఎల్.చంద్రకళ, డీఈఓ, పల్నాడుజిల్లా

అభయారణ్యానికి రాణి



నల్లమల టైల్‌ఎండ్.. నాగార్జునసాగర్– శ్రీశైలం పులుల అభయారణ్యం.. పల్నాడు జిల్లాలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతమిది. జిల్లా ఫారెస్ట్ అధికారిగా జి.కృష్ణప్రియ తన విధులను సమర్థంగా నిర్వహిస్తున్నారు. కొద్ది నెలల కిందటే డీఎఫ్‌ఓగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ జిల్లా పరిధిలోని అటవీ ప్రాంతంపై పట్టు సాధించారు. పెద్దపులులు జిల్లాలోని దుర్గి, లోయపల్లి, వెల్దుర్తి, కారంపూడి, బొల్లాపల్లి మండలాల్లో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు గుర్తించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకున్నారు. ఆయా ప్రాంతాలలోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రజలకు, వన్యప్రాణులకు రక్షణ ఇస్తూ సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రతి మహిళను గౌరవించాలి

ప్రతి మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. మహిళా సమాజంతో తన గౌరవాన్ని కోరుకుంటుంది. ఈ ఏడాది మహిళా దినోత్సవ థీమ్‌లో ఒకటైన సమానత్వం వాస్తవ రూపం దాల్చాలి. లింగ వివక్షకు సమాజంలో తావివ్వకూడదు.

-జి.కృష్ణప్రియ, డీఎఫ్‌ఓ, పల్నాడుజిల్లా

లక్ష్యాన్ని అల్లుకున్న లత

చిన్న తనంలోనే తండ్రిని కోల్పోయింది ఆమె. తన మాతృమూర్తి తనను, తమ్ముడిని పెంచేందుకు పడిన కష్టాన్ని గమనిస్తూ ఎదిగింది. చదువు పూర్తిచేసుకొని ఉద్యోగ వేటలో గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికయ్యారు. తల్లి పెళ్లి చేసింది. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. కానీ, తాను ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలనే లక్ష్యానికి మెట్టినిల్లు అండగా నిలిచింది. భర్త, అత్తమామలు అందించిన ప్రోత్సాహంతో గ్రూప్–1 ఉద్యోగానికి ఎంపికై రెవెన్యూ డివిజనల్ అధికారిగా నరసరావుపేట ఆర్డీవోగా మధులత బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా చిక్కుముడిగా ఉన్న లింగంగుంట్ల ఈనాం భూ సమస్యను పరిష్కరించటంలో తనదైన పాలనను చూపారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందడుగు వేయాలి



ప్రతి మహిళా లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందడుగు వేయాలి. అప్పుడే ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి లక్ష్యం సాధించగలరు. మహిళకు ఒకరోజును ఏర్పరిచి ఉత్సవాలు జరపటం మహిళలకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నా. మహిళల హక్కులు, చట్టాలు తీసుకురావటం అభినందనీయం.

- కె.మధులత, ఆర్డీఓ, నరసరావుపేట

న్యూస్‌రీల్

పోలీసులకు లొంగిపోయిన వెల్ఫేర్ కార్యదర్శి

దాచేపల్లి: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో వార్డు సచివాలయం –3లో వెల్ఫేర్ కార్యదర్శి సంపత్ లక్ష్మీప్రసాద్ శుక్రవారం పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. ఈనెల 1న రూ.8.23 లక్షల పింఛను నగదును తీసుకుని పరారైన విషయం విదితమే. దీనిపై నగర పంచాయతీ కార్యదర్శి ఎం.వి.అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లక్ష్మీప్రసాద్ పోలీసులకు లొంగిపోయి తాను చేసిన తప్పు అంగీకరించినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో వివరాలు తెలియాల్సి ఉంది. పింఛనుదారులకు ఇవ్వాల్సిన నగదు ఎత్తుకెళ్లిన లక్ష్మీప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు నగరపంచాయతీ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

మహిళల భాగస్వామ్యం తప్పనిసరి



తెనాలిరూరల్: అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని సబ్‌కలెక్టర్ సంజనా సింహా అన్నారు. తెనాలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సభకు ఎంపీడీవో అత్తోట దీప్తి అధ్యక్షత వహించారు. సబ్ కలెక్టర్ సంజనా సింహా ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వెలుగు ఏపీఎం జయశ్రీ వందన సమర్పణ చేశారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. తెనాలి డీఎల్‌డీఓ శ్రీదేవి, పంచాయతీ రాజ్ ఏఈ పార్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, సీడీపీఓ సునీత పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను సబ్ కలెక్టర్ సందర్శించారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఆర్డీ కార్యాలయంలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 44 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు గత ఏడాది డిసెంబరు 30న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. నోటిఫికేషన్‌లో 44 కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఉన్నాయని, 5,888 మంది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

స్వచ్ఛాంధ్ర పోస్టర్ల ఆవిష్కరణ



గుంటూరురూరల్: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ భార్గవ్ తేజ, నగర కమిషనర్ శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, డీపీఓ సాయికుమార్, రూరల్ మండలం ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, విస్తరణ అధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ అధికారి కె మయూరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రేమ, కరుణ ప్రసాదించండి

- విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్
- ఘనంగా మొదలైన సాగర్‌మాత మహోత్సవాలు



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్

విజయపురిసౌత్ : శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ, వాత్సల్యాలను భక్తులకు ప్రసాదించాలని సాగర్‌మాత విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్ ప్రార్థించారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో శుక్రవారం ప్రారంభమైన సాగర్‌మాత మహోత్సవాలను పురస్కరించుకొని జరిగిన సమష్టి దివ్య బలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర్‌మాత(మరియమ్మ) ఆశీస్సులు ఎల్లవేళల మీయందరి యందున ఉంటాయని, ఆ తల్లిని భక్తి విశ్వాసాలతో పూజిస్తే కోరికలతో పాటు పాపాలు చెరిగిపోతాయని ఉద్బోధించారు. పరిపూర్ణమైన హృదయంతో, జ్ఞానంతో, వివేకంతో మన తండ్రి అయిన ఏసుక్రీస్తును ప్రార్థించాలని, నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలని కోరారు. ఆ తరువాత సాగర్‌మాత మహోత్సవాల సందర్భంగా ఆలయాలను, జపమాల క్షేత్రాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీనికి ముందు ఉదయం 5.30గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్‌చే, 6.30గంటలకు గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెంచే దివ్యబలిపూజ, 9.30 గంటలకు గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్‌చే జపమాల, స్తుతి ఆరాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, 2గంటలకు గురుశ్రీ గోపు జోసఫ్ చే వాక్య పరిచర్య, స్వస్థత ప్రార్థనలు, సాయంత్రం 5.30గంటలకు గురుశ్రీ ప్రత్తిపాటి మరియదాసుచే జపమాల, నవదిన జపములు, తేరు ప్రదక్షిణ, దివ్య బలిపూజ 7.30గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ, రాత్రి 8గంటలకు సాగర్‌మాత కళాకారుల బృందంచే యేసేపు చరిత్ర బుర్రకథ, రాత్రి 9గంటలకు ధనవంతుడు బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శించారు. 8,9తేదీల్లో కార్యక్రమాలునిర్వహించనున్నా రు.

భారీగా తరలివచ్చిన భక్తులు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో విజయపురిసౌత్ కళకళలాడింది. లాంచీస్టేషన్ సెంటర్ నుంచి సాగర్‌మాత దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపుల తినుబండారాల దుకాణాలు, ఫ్యాన్సీ షాపులు, వివిధ రకాల ఆటబొమ్మల షాపులు వెలిశాయి. సాగర్‌మాత ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన జెయింట్ వీల్, రంగుల రాట్నాలు ఆకర్షణగా నిలిచాయి. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఉచిత వైద్య శిబిరాలు

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కెపీ చారి, కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటుచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సమృద్ధి ఫౌండేషన్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

సాగర్‌మాత తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

మాచర్ల : మాచర్ల ఆర్టీసీ డిపో నుంచి సాగర్‌మాత తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తుండటంతో శుక్రవారం ఉదయం నుంచి 15 ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీఎం వీరాస్వామి తెలిపారు. గుంటూరు నుంచి మాచర్లకు రైలులో వచ్చే ప్రయాణికులను సాగర్‌మాతా తిరునాళ్లకు చేర్చేందుకు రైల్వేస్టేషన్ వద్ద ప్రత్యేకంగా మరో ఎనిమిది బస్సులు ఏర్పాటు చేశారు. మరో రెండు రోజులపాటు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాచర్ల నుంచి తిరునాళ్లకు బయలుదేరిన ఆర్టీసీ బస్సు సర్వీసు

రెవెన్యూపై సైబర్ వల

- ఏసీబీ అధికారులమంటూ బెదిరింపులు
- ఆర్‌ఐ నుంచి రూ.70 వేలు వసూలు
- మోసపోయాక సైబర్ అధికారులకు ఫిర్యాదు
- తెలిసిన వారి పనేనని అనుమానాలు



నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయం

నరసరావుపేటటౌన్: 'హలో మేము ఏసీబీ అధికారులం.. మీ డిప్యూటీ తహసీల్దార్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ దొరికారు. మీ ఆస్తులపై దాడులు చేయబోతున్నాం. మీరు డబ్బులిస్తే వదిలేస్తాం' అని నరసరావుపేట తహసీల్దార్‌కు రెండు రోజుల కిందట సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తహసీల్దార్ తొలుత కొంత తత్తరపాటుకు గురై, అనంతరం మా ఆస్తులపై దాడులు చేసుకోవచ్చంటూ బదులిచ్చారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌ను టార్గెట్ చేసిన సదరు మోసగాళ్లు మీ అవినీతి బాగోతమంతా తమకు తెలుసునని, అకౌంట్లో మనీ వేస్తే వదిలేస్తామని బెదిరించారు. ఆర్‌ఐ వివరాలు తెలుసుకుని తనకు కాల్ చేశారు. తాము ఏసీబీ అధికారులమని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌పై దాడులు చేశామని చెప్పి భయపెట్టారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఇద్దరు పిల్లలు విదేశాల్లో చదివిస్తున్నట్లు తెలిసిందని, అంత డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో లెక్క చెప్పాలంటూ ప్రశ్నించారు. అడిగినంతా ఇస్తే మీ జోలికి రానని చెప్పారు. దీంతో ఆర్‌ఐ రూ.70 వేలు వారు చెప్పిన ఖాతాకు జమ చేశారు. వీరంతా ఒక్క చోటకు చేరి విషయం తెలిశాక తాము మోసపోయామని గుర్తించారు. ఈ విషయంపై సైబర్ నియంత్రణ విభాగానికి డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు చేశారు.

తెలిసిన వారి పనే (నా)?

ఆన్‌లైన్‌లో తహసీల్దార్ నంబరు మాత్రమే అందుబాటులో ఉంటుంది. డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐల నంబర్లు ఉండవు. తహసీల్దార్‌కు కాల్ చేసిన వారు, డీటీ, ఆర్‌ఐలను సైతం బెదిరించి ఆర్‌ఐ వద్ద నగదు వసూలు చేశారు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి గురించి బాగా తెలిసిన వారే చేశారని చర్చించుకుంటున్నారు. ఈ కోణంలోనూ సైబర్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. మొత్తానికి ఏసీబీ పేరుతో వచ్చిన కాల్స్ కారణంగా రెవెన్యూ ఉద్యోగుల్లో కలకలం రేగింది.

సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశాం

తనతో పాటు డీటీకి రెండు రోజుల కిందట ఫోన్ చేసి ఏసీబీ అధికారులమంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. లంచం తీసుకుంటుండగా డీటీని పట్టుకున్నామని చెప్పారు. ఆర్‌ఐను బెదిరించి అతని వద్ద నుంచి రూ.70 వేలు కాజేశారు. వెంటనే అప్రమత్తమై వన్‌టౌన్ సీఐ చరణ్‌కు విషయాన్ని తెలియజేశాం. ఆయన ఇచ్చిన సూచన మేరకు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేసి నగదు పంపిన అకౌంట్ వివరాలు చెప్పి సీజ్ చేయాలని కోరాం. జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీటీకి చెప్పాను.

- వేణుగోపాల్, తహసీల్దార్

ప్రపంచ శాంతి కోసమే గుడారాల పండుగ

- ఫాస్టర్ అబ్రహం
- తరలివచ్చిన విశ్వాసులు



ఆరాధికులనుద్దేశించి ప్రసంగిస్తున్న దైవజనులు ఫాస్టర్ అబ్రహం

అమరావతి: ప్రభువైన ఏసుక్రీస్తుచే తేజరింపచేసి ప్రపంచంలోని మానవులందరి ఉజ్జీవం కోసం గుడారాల పండుగలో ప్రార్థనలు చేస్తున్నామని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు, దైవజనులు ఫాస్టర్ అబ్రహం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హోసన్నా దయాక్షేత్రంలో హోసన్నా మినిస్ట్రీస్ నిర్వహించే 48వ గుడారాల పండుగ రెండవ రోజు రాత్రిపూట ప్రార్థనలకు వచ్చిన లక్షలాది మంది ఆరాధికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఈ పండుగలో విశ్వాసులు, సేవకులు ఉజ్జీవింపబడాలంటే దేవుని చేత ప్రకాశించి, వాక్యం మీద ఆసక్తి కలిగి దేవుని ప్రార్థనే ఊపిరిగా భావించాలన్నారు. దేవున్ని స్తుతించకుండా, ఆరాధించకుండా ఉండలేనన్నే స్థితికి మనం చేరుకోవాలన్నారు. తాను కూడా అనేకులను ప్రభువు చెంతకు చేర్చటానికి సారధిగా మారాలనే సంకల్పం ఉండాలన్నారు. దేవుని యందు విశ్వాసంతో మనం పనిచేయగలిగితే జనులు కూడా నిన్ను అనుసరిస్తారు, అందుకు దైవజనులు ఏసన్న జీవితమే సాక్ష్యమన్నారు. 48 సంవత్సరాల కిందట కేవలం 80 మందితో నిర్వహించిన గుడారాల పండుగకు అదే గ్రామంలో నేడు లక్షలాదిమంది తరలిరావడం మనం ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. వసతులు ఉన్నా, లేకపోయినా, అవకాశం ఉన్నా లేకపోయినా లక్షలాది మంది ఈ దయాక్షేత్రానికి రావడానికి కారణమైన ఏసుప్రభు చూపిన మార్గంలో మనందరి నడిపిన దైవజనులు ఏసన్న కారణజన్ముడన్నారు. దేవుని కృప నీపై ప్రసరించబడిన ఈరోజు నుంచి ప్రతి ఒక్కని జీవితంలో సర్వసమృద్ధి కలుగుతుందన్నారు. దేవుడు తనని నమ్మినవారందరిని ఒకరి వద్ద చేతుల చాచే స్థితిలో లేకుండా అదృష్టాన్ని ప్రసాదించబోతున్నారన్నారు. దేవుని అనుగ్రహం పొందినవారిని తృణీకరించిన వారందరూ సాగిలపడతారన్నారు. అనంతరం రెండవ వర్తమానంలో హోసన్నా మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ ప్రసంగించారు. తొలుత దేవుని స్తుతి గీతాలకు సండేస్కూల్ చిన్నారుల నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. సుపీరియర్ సిస్టర్ ప్రేమ ఆధ్వర్యంలో దేవని గీతాలాపనలు విశ్వాసులను భక్తిభావంలో ఓలలాడించాయి. ఈ ప్రార్థనలలో దేశం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాదిమంది హోసన్నా ఆరాధికులు పాల్గొన్నారు.



ప్రార్థనలలో పాల్గొన్న లక్షలాదిమంది ఆరాధికులు

క్లుప్తంగా

కోటప్పకొండ కొండలపై జిల్లా అధికారుల ట్రెక్కింగ్



నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కోటప్పకొండలో మహిళా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ట్రెక్కింగ్ నిర్వహించారు. మహిళా అధికారులైన ఐ అండ్ పీఆర్ డీడీ దీప్తి, డీఎఫ్‌ఓ కృష్ణప్రియ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, ప్రకృతి వ్యవసాయ డీపీఎం అమలకుమారి, సర్వేయర్ ఏడీ భానుకీర్తి, కార్మిక విభాగ అసిస్టెంట్ కమిషనర్ ధనలక్ష్మి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రమణ, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కుముదిని పాల్గొనగా, ఫారెస్టు విభాగం ఏర్పాటు చేసిన పోజ్ ఆర్చ్ ముందు కలెక్టర్, ఎస్పీ, మహిళా అధికారులు తమ ఫొటోలు దిగారు. అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్ పాల్గొన్నారు.

డీఎస్సీ బీసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలో డీఎస్సీ-2025 పరీక్షకు అర్హులైన బీసీ, ఈబీసీ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి బి.శివనాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 10వతేదీలోగా పట్టణంలోని తిలక్ స్కూల్ రోడ్డులోని బీసీ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టీటీసీ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9441630075లో సంప్రదించాలని కోరారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



కొరిటెపాడు(గుంటూరు): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈమేరకు ఉద్యోగులు, అధికారులు శుక్రవారం చంద్రమౌళి నగర్‌లోని కెనరా బ్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక(యుఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ బాషా మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ ఉద్యోగ సంఘ నేత పరేంద్ర మాట్లాడుతూ ఐడీబీఐ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. యూబీఐ ఉద్యోగ నేత రాంబాబు, యూఎఫ్‌బీయూ సలహాదారుడు పి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మదర్‌థెరిస్సా, కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు పోలీసు విభాగం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు హాలులో సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ విశ్వ క్రీడా వేదికపై మహిళలు రాణిస్తూ వారి దేశాల జెండాలను రెపరెపలాడిస్తున్నారని చెప్పారు.

అక్షరాస్యతలో ప్రతి ఏడాది మహిళల యొక్క అంకె పెరుగుతూ ఉందని వివరించారు. అయితే ఇంకా చిన్నారుల మీద, పసికందుల మీద లైంగికదాడులు జరుగుతూ ఉన్నాయని, వీటిని నివారించేందుకు ప్రభుత్వం చట్టాలు చేసి ప్రత్యేకమైన న్యాయస్థానాలు ఏర్పాటు చేయటంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. ఎప్పుడైనా, ఎక్కడైనా మహిళలు పనిచేసే ప్రదేశం, వారు ప్రయాణించే వాటిలో కానీ, నివాసం ఉంటున్న చోట కానీ ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే స్పందించేందుకు ఎన్నో టోల్ ఫ్రీ నంబర్లు ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కానీ వాటిని ఉపయోగించుకునే మహిళల శాతం తక్కువగానే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డు ప్రొఫెసర్ టీడీ విమల, నరసరావుపేట లీగల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ టి.అమూల్య, ఏరియా హాస్పిటల్ డాక్టర్ వెంకటరమణ, డీఈఓ ఎల్.చంద్రకళ, ఏఎంవీఐ మనీషా, ఐసీడీఎస్ పీడీ ఎస్.ఉమాదేవి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, సోషల్ మీడియాలో మహిళలకు గోప్యతను కాపాడే అవసరమైన డిజిటల్ భద్రత, స్వీయరక్షణ, మహిళలకు పని ప్రదేశాల భద్రత, వేధింపులపై మౌనాన్ని వీడటం, బహిరంగ ప్రదేశాలలో మహిళల భద్రత సవాళ్లు, పరిష్కారాలు, మహిళల భద్రతకు భరోసా ఇవ్వడంలో పురుషుల పాత్ర, పని ప్రదేశంలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి స్థానాలు, వ్యూహాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి వాటిపై సమగ్రంగా చర్చించారు. పరిపాలన విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటరమణ, సీఐ కేవీ సుభాషిణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన విదేశీ బృందం



ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల గురించి విదేశీయులకు వివరిస్తున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో మండలంలో సాగు చేస్తున్న వరి, కంది క్షేత్రాలను ఫ్రాన్స్ దేశానికి చెందిన విదేశీ బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. మండలంలోని నాగిరెడ్డి పాలెంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలకు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కె.అమలుకుమారి విదేశీ బందాన్ని తీసుకెళ్లి అవగాహన కల్పించారు. బీజామృతం, విత్తన గుళికలు, ద్రవ జీవామృతం, ఘనజీవామృతం, నీమాస్త్రం తయారు చేస్తున్న విధానాలను మహిళా రైతులు వారికి వివరించారు. కంది పంటలో ఏ గ్రేడ్ మోడల్ వ్యవసాయ క్షేత్రాన్ని చూపించి, కంది పంటలో ఐదు నుంచి పది రకాల అంతర పంటలు వేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని చెప్పారు. నిరంతరం ఆదాయం వచ్చే ఏటీఎం మోడల్ సూర్య మండలం మోడల్‌లో 27 రకాల కూరగాయల పంటలను రైతుల పండిస్తున్నట్లు తెలిపారు. నంది రాజుపాలెంలో మహిళా రైతు అనంతలక్ష్మి పండిస్తున్న వరి ఏ గ్రేడ్ మోడల్ క్షేత్రాన్ని సందర్శించారు. వరి పొలం గట్లపై అరటి, కొబ్బరి, బొప్పాయి, జామ, బంతి పలు రకాల చెట్లను నాటడాన్ని వివరించారు. కందిపాడు గ్రామంలో రైతు నాగమల్లేశ్వరరావు సాగు చేస్తున్న ప్రధాన పంట దొండ పందిరి తోట, అందులో అంతర పంటలుగా వేసిన టమోటో బంతి చిక్కుడు ఆముదం పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో స్టేట్ ఎస్‌ఎఫ్‌ఏ మౌనిక, జిల్లా ఎస్‌ఎఫ్‌ఏలు నందకుమార్, ప్రవీణ, ఎంటీలు అనంతలక్ష్మి, జయలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

ఊపిరాడక... ఉక్కపోసి...

- ఇదేం చోద్యం
- ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరంలో అవస్థలు
- ఇరుకు గదుల్లో ప్రత్యేక అవసరాల చిన్నారులకు పరీక్షలు



ఇరుకు గదుల్లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసరావుపేట ఈస్ట్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో తమకు పనేంటి అనుకున్నారో ఏమో.. ఏ ఒక్క జిల్లా అధికారి అటువైపు కన్నెత్తి చూడలేదు. మానసిక, శారీరక దివ్యాంగులు అవటం వలనేమో నోరు తెరిచి అడగలేరనే ధీమా కాబోలు కనీస సదుపాయాలు కల్పించలేదు. పట్టుమని 50 మందికి కూడా సరిపోని ఇరుకు గదిలో దాదాపు 300 మందికి శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పాతూరులోని భవిత పాఠశాలలో ఏర్పాటు చేయటంతో ప్రత్యేక అవసరాల చిన్నారులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కనీసం మూడు గదులు కూడా లేని చిన్న పాఠశాలలో జిల్లా పరిధిలోని 11 మండలాలకు చెందిన భవిత పాఠశాలల దివ్యాంగ చిన్నారులకు వైద్య నిర్ధారణ కోసం ఏర్పాటు చేయటం విమర్శలకు తావిచ్చింది. కిక్కిరిసిపోయిన గదుల్లో చిన్నారులు ఊపిరి ఆడక తీవ్ర ఇబ్బంది పడ్డారు. అధికారుల లెక్కల ప్రకారం 161 మంది చిన్నారులకు ఉపకరణాలను నిర్దేశిస్తూ వైద్యులు ధ్రువీకరించారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, 11 మండలాలలో భవిత పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది హాజరు కావటంతో గందరగోళ పరిస్థితి కనిపించింది. దీనిపై ఐఈడీ కోఆర్డినేటర్ ఆర్.సెల్వరాజ్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలతో హడావుడిగా క్యాంప్ నిర్వహించాల్సి వచ్చిందన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా భవిత పాఠశాలలో ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు.

దివ్యాంగుల బదిలీల్లో వెసులుబాటు కల్పించండి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లయ్య కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులను ప్రాధాన్య క్రమంలో చేర్చి బదిలీలు నిర్వహించాలన్నారు. 70 శాతం పైబడి ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని ఒకవేళ వారు కోరుకుంటే మొదటి ప్రాధాన్యం వారికే ఇవ్వాలని కోరారు. 2025లో రూపొందించిన ఉపాధ్యాయ బదిలీ చట్టంలోని దివ్యాంగులకు ఇబ్బందికరంగా ఉన్న అంశాలను తొలగించాలన్నారు.

సాంకేతికతతో కొత్త అవకాశాలు

ల్లాయిడ్ హెల్త్ కేర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రెసిడెంట్ మహేష్ కవథేకర్



చేబ్రోలు: సాంకేతికతతో కొత్త అవకాశాలు పుట్టుకొస్తాయని ల్లాయిడ్ హెల్త్ కేర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రెసిడెంట్ మహేష్ కవథేకర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నావిగేటింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విత్ టెక్నాలజీ అండ్ సస్టైనబిలిటీ' అనే అంశంపై రెండు రోజుల పాటు బ్లెండెడ్ మోడ్‌లో నిర్వహించే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్ కవథేకర్ మాట్లాడుతూ ఆటోమేషన్, ఏఐ, డేటా ఎనలిటిక్స్ తదితర అంశాల గురించి వివరించారు.

వారబందిపై రైతులకు అవగాహన కల్పించండి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి సమీక్ష



కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

నరసరావుపేట: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిని జిల్లాలో పంటల సాగు వినియోగానికి అవలంబిస్తున్న వారబందీ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలసి రబీ సాగు, వేసవి తాగునీటి సరఫరాకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటి వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు నీటిలో మన రాష్ట్ర వాటాను వృథా చేయకుండా కాలువలపై ఆధారపడి సాగు చేస్తున్న ప్రతి ఎకరాకూ నీరు అందించాలని కోరారు. నీటి చౌర్యానికి పాల్పడుతూ చివరి ఆయకట్టు రైతులకు నీరు అందకుండా చేసే రైతులకు వాస్తవ పరిస్థితిని వివరించాలని చెప్పారు. ప్రాజెక్టు నీటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు సాయం తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, సాగర్ ప్రాజెక్టు అధికారులు సమన్వయం చేసుకుని ప్రాజెక్టులో నీటిని రైతులందరూ న్యాయబద్ధంగా వినియోగించుకునేలా చూడాలన్నారు. మార్చి నెలాఖరు వరకూ రైతులకు నీరు అందించడమే మొదటి ప్రాధాన్యం అని, ఏప్రిల్‌లో తాగునీటి వినియోగం కోసం ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ప్రస్తుతం 40 శాతం లోపు నీరున్న చెరువులను నింపేందుకు మాత్రమే ప్రాజెక్టు నీటిని వినియోగించాలని కోరారు. ఇప్పటికే నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న బొల్లాపల్లి మండలానికి నీరు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో ఎ.మురళి, నాగార్జునసాగర్ ప్రాజెక్టు చైర్మన్ కాంతారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ కృష్ణమోహన్, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, ఆర్డీఓ కె.మధులత, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి పాల్గొన్నారు.

తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జిల్లాలో గిరిజనులు నివాసం ఉండే తండాలలో వారు జీవించేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో గిరిజన ఆవాసాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్-దర్తీ అభ) పథకానికి చెందిన గైడ్‌లైన్స్ గురించి సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. జిల్లాలోని ఎంపీడీవోలకు పలు సూచనలు చేశారు. జిల్లాలోని ఐదు మండలాలైన మాచర్ల, దుర్గి, దాచేపల్లి, అచ్చంపేట, బొల్లాపల్లిలలో 17 రకాలైన సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీనిలో 17 విభాగాల అధికారులు పాలు పంచుకుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కె.జ్యోత్స్న, పశుసంవర్ధకశాఖ పీడీ కాంతారావు, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరం

సీఆర్‌డీఏ ఎస్ఈ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం

చిలకలూరిపేట: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని సీఆర్‌డీఏ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యుత్ విజిలెన్స్ అధికారుల బృందం శుక్రవారం కనెక్షన్ల తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో 35 మంది అధికారులు, 105 మంది సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 2,074 సర్వీసులు తనిఖీ చేసి, రూ.3.08 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఒకరిని గుర్తించి రూ.10 వేలు, ఇతర కేటగిరిలో విద్యుత్ వినియోగిస్తున్న మరొకరిని గుర్తించి రూ.10 వేలు చొపజరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వినియోగించుకుంటున్న 55 మందిని గుర్తించి రూ.2.86 లక్షలు జరిమానా విధించటం జరిగిందన్నారు. దాడుల్లో ఈఈలు సీహెచ్ వెంకటేశ్వరరావు, బి.సంజీవరావు, డీఈఈలు ఎస్ఎం ప్రసాద్, ఆర్.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా ఫిర్యాదుల విండోకు విశేష స్పందన

57 ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



మహిళా పోలీస్‌స్టేషన్‌లో మహిళల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న దృశ్యం

నగరంపాలెం: మహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టిన మహిళా ఫిర్యాదుల విండోకు విశేష స్పందన లభించిందని ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష చెప్పారు.ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లలో మహిళా ఫిర్యాదుల విండో కార్యక్రమాన్ని నిర్వహించారు. చి మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 64 మంది మహిళలు ఫిర్యాదులివ్వగా, అందులో 57 సమస్యలను తక్షణం పరిష్కరించినట్టు అధికారులు చెప్పారు. ఈ సదర్భంగా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష మాట్లాడుతూ ప్రత్యేక ఫిర్యాదుల విండో మంచి కార్యక్రమమని పేర్కొన్నారు.

కనుల పండువగా జీవధ్వజ ప్రతిష్టా మహోత్సవం



ప్రతిష్టా మహోత్సవానికి హాజరైన భక్తులు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి వీరాంజనేయ స్వామి దేవస్థానం జీవధ్వజ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, పంచగవ్యారాధన, ప్రాతఃసవనం, ఉక్త, మూర్తి హోమాలు, రత్నన్యాసం, బీజన్యాసం, యంత్ర స్థాపన చేపట్టారు. జీవధ్వజ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కళావాహన, ధేను దర్శనం, కుంభదృష్టి, ప్రథమ పూజ, పూర్ణాహుతి, నీరాజనమంత్రపుష్పములు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జై శ్రీ రామ్ ... జై హనుమాన్ నామస్మరణ మార్మోగింది. దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ససిమెళ్ళ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

జనరిక్ ఔషధాల వినియోగంపై అవగాహన కల్పించాలి

జన ఔషధి దివస్‌లో ఎంపీ లావు సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ లావు

నరసరావుపేట: జనరిక్ మందుల ఔషధాల వినియోగం పెరిగేలా డాక్టర్లు శ్రద్ధ చూపాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. శుక్రవారం జన ఔషధి దివస్‌ను పురస్కరించుకొని పల్నాడురోడ్డులోని పాత ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రధానమంత్రి జనరిక్ షాపు వద్ద డీఎంహెచ్‌ఓ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన జనరిక్ షాపుల ద్వారా చాలా తక్కువ ధరకే నాణ్యమైన మందులు అందించటం జరుగుతుందని చెప్పారు. డీఎంహెచ్‌ఓ బి.రవి, జిల్లా డ్రగ్ నియంత్రణ అధికారి డాక్టర్ డి.సునీత, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణ అధికారి డాక్టర్ బీవీ రంగారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు



సీహెచ్‌సీలో గాయపడిన క్షతగాత్రులకు చికిత్స

అమరావతి: మండల పరిధిలోని లేమల్లెలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయపడ్డారు. పోలీసుల అందించిన వివరాలు.. లేమల్లెలో జరుగుతున్న గుడారాల పండుగకు గుంటూరు ఏటీ అగ్రహారం నుంచి ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఆటోలో బయదేరి వస్తున్నారు. అలాగే మంగళగిరికి చెందిన కట్టి ప్రకాశరావు స్కూటీపై మంగళగిరి నుంచి గుడారాల పండుగకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వేగంగా వస్తున్న నీళ్ల ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ ప్రమాదశాత్తు తొలుత స్కూటీని ఢీకొట్టి, అనంతరం ఆటోని కూడా ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఏడుగురు గాయపడగా అందులో మంగళగిరికి చెందిన కట్టి ప్రకాశరావు, గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన దేవరపల్లి మారుతయ్యలకు తీవ్రగాయాలు కాగా, మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అందించిన మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



జోష్ రాణి

పెదకూరపాడు: చదువుకోవటం నాకు ఇష్టం లేదు... నన్ను బలవంతం పెట్టకండి.. నేను హాస్టల్‌కి వెళ్లను. ఇంటివద్ద ఉంటాను... అంటూ విద్యార్థి చెప్పడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పంట పొలంలోని పురుగులు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని జలాలపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జలాలపురం గ్రామానికి చెందిన మన్నవ శరీలు, చిట్టెమ్మల కుమార్తె మన్నవ జోష్ రాణి (17) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సెలవులకు స్వగ్రామం జలాలపురం వచ్చింది. సెలవులు అనంతరం కళాశాలకు వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. చదువు ఇష్టం లేదని జోష్ రాణి చెప్పటంతో కళాశాలకు వెళ్లక పోతే నాతో పాటు వ్యవసాయ పనులకు రావాలని ఒత్తిడి చేయటంతో రెండు రోజులపాటు తల్లితో కలిసి మిరప కోత పనులకు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం మిర్చి కోతలు కోస్తున్న పంట పొలంలో రైతు దాచుకున్న పురుగులు మందును తాగింది. వాంతులు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్‌కు దేహశుద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్‌కు తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన విద్యార్థిని గుంటూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్లో ఉండి చదువుతోంది. ఈనెల 3 నుంచి పొన్నూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాల పరీక్ష కేంద్రంలో సీనియర్ ఇంటర్ పరీక్షలకు రాస్తోంది. ఇన్విజిలేటర్‌గా వ్యవహరిస్తున్న యువకుడు పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం, ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ అడగడం చేశాడు. దీంతో విద్యార్థిని తాను చదువుతున్న కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. కళాశాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకుడిని రెండు రోజుల క్రితం మందలించారు. అదే రోజు అతడిని ఇన్విజిలేషన్ విధుల నుంచి అధికారులు తొలగించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి యువకుడిని కళాశాలకు పిలిపించారు. అతడికి దేహశుద్ధి చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ చదువుతున్న వ్యక్తిని అధికారులు ఇన్విజిలేటర్‌గా నియమించడం గమనార్హం. ఈ విషయం ఆర్‌ఐఓ జీకే జుబేర్ దృష్టికి వెళ్లడంతో ఎంబీఏ విద్యార్థిని ఇన్విజిలేటర్‌గా నియమించడంపై చీఫ్ సూపరింటెండెంట్‌ను సంజాయిషీ కోరారు.

1,22,426 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,11,958 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,22,426 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,500 వరకు పలికింది.